బంగాళాఖాతంలో అల్పపీడనం

● 9 జిల్లాలకు వర్ష సూచన

చెన్నై, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో కొత్తగా అల్పపీడనం ఏర్పడటంతో కావేరి డెల్టా సహా తొమ్మిది జిల్లాల్లో ఆదివారం భారీగా వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. దక్షిణ శ్రీలంక, దాని పక్కనే నైరుతి బంగాళాఖాతం ప్రాంతంలో అల్పపీడనం ఏర్పడిందని, ఆదివారం అది వాయువ్య దిశగా నెమ్మదిగా కదిలే అవకాశాలున్నాయన్నారు. ఈ అల్పపీడనం కారణంగా రాష్ట్రంలో వచ్చే మూడు రోజుల్లో చెదురుమదురుగా వర్షాలు కురుస్తాయని తెలిపారు. ఈ నెల 19 నుంచి 21 వరకు రాష్ట్రంలో పలు చోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని తెలిపారు. ఆదివారం తిరునల్వేలి, కన్నియాకుమారి, విల్లుపురం, కాంచీపురం, కడలూరు, మైలాడుదురై, నాగపట్టినం, తిరువారూరు, రామనాథపురం జిల్లాల్లో భారీగా వర్షాలు కురుస్తాయన్నారు. చెన్నై, తిరువళ్లూరు జిల్లాల్లో ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొన్నారు.

భర్తీకాని మెడికల్ సీట్లకు
నేడు ప్రత్యేక కౌన్సెలింగ్

అడయార్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు వైద్య కాలేజీలు, డీమ్డ్ వర్శిటీల్లో భర్తీకాని 400 వైద్య సీట్లకు ఆదివారం ప్రత్యేకంగా కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. రాష్ట్రంలో ఉన్న 5 వేల మెడిసిన్ సీట్ల భర్తీకి ఇప్పటివరకు మూడు దశల్లో కౌన్సెలింగ్ నిర్వహించారు. అయినప్పటికీ మరో 400 సీట్లు మిగిలిపోయాయి. ప్రభుత్వ వైద్య కాలేజీల్లో రెండు సీట్లు, ప్రైవేటు వైద్య కాలేజీల్లో ప్రభుత్వ కోటా కింద 58 సీట్లు ఖాళీగా ఉన్నాయి. వీటిలో నీలగిరి, తిరుచ్చి ప్రభుత్వ వైద్య కాలేజీల్లో (స్టేట్ కోటా)లో ఒక్కో సీటు చొప్పున మిగిలిపోగా, వీటితో పాటు ప్రైవేటు కాలేజీల్లో ప్రభుత్వ కోటా కింద ఉన్న 58 సీట్ల భర్తీ కి స్ట్రే రౌండ్ (నాలుగో రౌండ్) పేరుతో ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఈ ఆన్‌లైన్ కౌన్సెలింగ్ పాల్గొనే విద్యార్థులు సీట్లు లభిస్తే ఈ నెల 20వ తేదీలోగా తమకు కేటాయించిన కాలేజీలో చేరాల్సి ఉంటుంది. అలాగే, ప్రైవేటు, డీమ్డ్ వర్శిటీల్లో కూడా సుమారుగా 340 వరకు వైద్య సీట్లు మిగిలిపోయాయి. వీటికి కూడా కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. కాగా, జాతీయ వైద్య విధాన మండలి ఆదేశాల మేరకు 2025-26 విద్యా సంవత్సరానికిగాను తరగతులు సెప్టెంబరు 22వ తేదీన ప్రారంభమైన విషయం తెల్సిందే.

పారిశుధ్య కార్మికులకు
ఆహార పథకం

● ప్రారంభించిన సీఎం స్టాలిన్

● 6 నుంచి అన్ని కార్పొరేషన్లకూ విస్తరణ



పారిశుధ్య కార్మికురాలికి ఇన్సులేటెడ్ కేరియింగ్ బ్యాగ్ అందజేస్తున్న ముఖ్యమంత్రి

చెన్నై, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ పారిశుధ్య కార్మికులు నగరాన్ని శుభ్రం చేసి అందంగా తీర్చిదిద్దటంలో ప్రధాన పాత్ర పోషిస్తున్నారని, అలాంటి కార్మికులను కంటికి రెప్పలా కాపాడే బాధ్యత తమ ప్రభుత్వానికి ఉందని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ అన్నారు. చేపాక్‌లోని కలైవానర్ అరంగంలో శనివారం ఉదయం జరిగిన కార్యక్రమంలో గ్రేటర్ చెన్నై కార్పొరేషన్‌లో పనిచేస్తున్న 31,373 మంది పారిశుధ్య కార్మికులకు లబ్ది కలిగించేలా ఉచిత ఆహారపథకాన్ని ప్రారంభించి, వెయ్యి మంది పారిశుధ్య కార్మికులకు కార్గిల్‌నగర్‌లో పెరుంబాక్కమ్‌లో నివాసగృహాలు కేటాయింపు ఉత్తర్వులు, ఇతర సహాయాలను పంపిణీ చేశారు. పారిశుధ్య కార్మికులకు ఇచ్చే ఉచిత ఆహారం రోజంతా వేడిగా ఉండేలా ఇన్సులేటెడ్ థర్మల్ కేరింగ్ బ్యాగ్, స్టెయిన్‌లెస్ స్టీల్ టిఫిన్ బాక్స్‌లను కూడా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం నగరంలో ప్రారంభించిన ఉచిత ఆహార పథకాన్ని డిసెంబర్ 6 నుంచి రాష్ట్రంలోని అన్ని కార్పొరేషన్లు, మునిసిపాలిటీలకు విస్తరింపజేయనున్నామని ప్రకటించారు. తాను చెన్నై మేయర్‌గా ఎంపికైనప్పుడు మాజీ మంత్రి కరుణానిధి తనకో మాట చెప్పారని, మేయర్ అంటే పదవి కాదని, బాధ్యత అని, రాజధాని నగరాన్ని అన్ని విధాలా కాపాడే బాధ్యత మేయర్‌కు ఉంటుందని తెలిపారని, ఆయన సూచనల ప్రకారమే ఆ పదవి సమర్థవంతంగా నిర్వహించగలిగానని చెప్పారు. పారిశుధ్య కార్మికులు నగరవాసులంతా నిదురపోతున్న సమయంలో అర్ధరాత్రి పూట తమ విధులను ప్రారంభించి సూర్యోదయానికి ముందే చెత్తాచెదారం తొలగించి పరిసరాలను శుభ్రంగా ఉంచుతారన్నారు. పారిశుధ్య కార్మికుల సేవలను గుర్తించే తమ ప్రభుత్వం వారికి 'సీఎం ఉచిత ఆహార పథకం' ప్రారంభించడం తనకెంతో సంతోషంగా ఉందన్నారు. ఈ ఉచిత ఆహారాన్ని పారిశుధ్య కార్మికులు పనిచేస్తున్న చోటే పంపిణీ చేయడానికి అనువుగా ఆ ఆహారపదార్థాలను ఇన్సులేటెడ్ థర్మల్ కేరియింగ్ బ్యాగ్, స్టెయిన్‌లెస్ స్టీల్ టిఫిన్ బాక్స్‌ల్లో ఉంచి వాటి వేడి తగ్గకుండా అందిస్తున్నామని చెప్పారు.



పారిశుధ్య కార్మికురాలి టిఫిన్‌బాక్స్‌లోని ఆహారాన్ని రుచిచూస్తున్న స్టాలిన్

త్వరలో రెస్ట్‌రూమ్‌లు

పారిశుధ్య కార్మికులకు ఎంత సేవ చేసినా చాలదంటూ త్వరలోనే వారికోసం విశ్రాంతి గృహాల నిర్మాణ పథకాన్ని అమలు చేయనున్నామని స్టాలిన్ ప్రకటించారు. ఆ పథకం కింద నగరంలోని 200 వార్డుల్లోనూ దుస్తులు మార్చుకోవడానికి, విశ్రాంతి తీసుకోవడానికి అనువుగా టాయిలెట్ సదుపాయంతో రెస్ట్‌రూమ్‌లను నిర్మించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రులు కేఎన్ నెహ్రూ, దామో అన్బరసన్, ఎం.సుబ్రమణ్యం, పీకే శేఖర్‌బాబు, డాక్టర్ ఎం. మదివేందన్, గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ మేయర్ ఆర్.ప్రియ, ఎంపీలు డాక్టర్ కళానిధి వీరాసామి, కనిమొళి సోము, ఎమ్మెల్యేలు తాయగం కవి, ఆర్టీ శేఖర్, ఇ.పరంధామన్, వెట్రి అళగన్, జోసెప్ సాముయేల్, సుదర్శనం, ప్రభాకర్‌రాజా, డిప్యూటీ మేయర్ ఎం. మహేష్‌కుమార్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎన్. మురుగానందం, రాష్ట్ర గృహవసతి కల్పన, నగరాభివృద్ధి శాఖ అదనపు ప్రధాన కార్యదర్శి కాకర్ల ఉషా, కార్పొరేషన్ కమిషనర్ జే కుమారగురుబరన్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ రద్దీ నియంత్రణపై
ప్రత్యేక దృష్టి

● 115 జంక్షన్లలో ఏఐ ట్రాఫిక్ సిగ్నళ్లు



ప్యారీస్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాజధాని నగరంలో స్మార్ట్ సిటీ పథకం కింద పలు అభివృద్ధి పథకాలను గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ), నగర ట్రాఫిక్ విభాగం పోలీసులు సంయుక్తంగా నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో నగరంలోని కూడళ్లలో ట్రాఫిక్ రద్దీని స్వయంచాలకంగా గుర్తించి వాటిపై తక్షణ చర్యలు తీసుకునే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సిగ్నల్స్ ఇప్పటికే 50 ప్రాంతాల్లో విజయవంతంగా పని చేస్తున్నాయి. ఈ సిగ్నళ్లు రహదారులపై వాహనాలు ఎక్కువసేపు బారులు తీరి ఉంటే.. అందుకనుగుణంగా పని చేస్తాయి. ఈ విధంగా నిర్దిష్ట రహదారుల్లో పొందుపరిచిన ఏఐ సిగ్నళ్లు ట్రాఫిక్ పోలీసులు లేకుండానే ఆటోమెటిక్‌గా పనిచేస్తుండటంతో నగరంలో ట్రాఫిక్ రద్దీ క్రమక్రమంగా తగ్గుతోంది. ఈ నేపథ్యంలో నగరంలో ఈ రకమైన సిగ్నళ్లు 165 ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలని ప్రణాళిక రూపొందించగా, ఇప్పటికే 50 ప్రాంతాల్లో ఏఐ సిగ్నళ్లు సత్ఫలితాలు చూపిస్తున్నాయి, మిగతా 115 జంక్షన్లలోనూ డిసెంబరు మొదటి వారం నుండి ఏఐ సిగ్నళ్లను ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టినట్లు జీసీసీ, నగర ట్రాఫిక్ విభాగం పోలీసులు తెలిపారు. ఈ జేటీఎస్ సిగ్నళ్లు అందుబాటులోకి వస్తే నగరంలో ఉన్న పాత ట్రాఫిక్ సిగ్నల్స్‌ను తొలగించనున్నట్లు పోలీసులు తెలిపారు.

విజయ్ నిరసన ఎక్కడో?

'సర్'కు వ్యతిరేకంగా నేడు టీవీకే ఆందోళనలు

అడయార్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ఎన్నికల సంఘం ఓటర్ల జాబితాలో సమగ్ర సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) సర్‌ను చేపట్టగా, దీనికి వ్యతిరేకంగా హీరో విజయ్ నేతృత్వంలోని 'తమిళగ వెట్రి కళగం' (టీవీకే) ఆదివారం రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేపట్టనుంది. ప్రస్తుతం ఈ సమగ్ర సవరణ పనులు తమిళనాడు, వెస్ట్ బెంగాల్, కేరళ సహా 12 రాష్ట్రాల్లో ప్రారంభించారు ఈ సమగ్ర సవరణకు రాష్ట్రంలో అధికార డీఎంకేతో పాటు పలు పార్టీలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ఈ నెల 3న డీఎంకే హైకోర్టులో పిటిషన్ కూడా దాఖలు చేయగా, అదేవిధంగా మరికొన్ని పార్టీలు కూడా కోర్టులను ఆశ్రయించాయి. అయితే, అన్నాడీఎంకే వంటి మరికొన్ని పార్టీలు మాత్రం సర్‌ను స్వాగతిస్తూ మద్దతునిస్తున్నాయి. ఈ నేపథ్యంలో విజయ్ సారథ్యంలోని టీవీకే మాత్రం 'సర్'ను తీవ్రంగా వ్యతిరేకిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చింది. ఈ పిలుపు మేరకు ఆదివారం ఆయా జిల్లా కేంద్రాల్లో కలెక్టరేట్‌ల ఎదుట ఆందోళన కార్యక్రమాలు జరుగనున్నాయి. చెన్నై నగరంలో శివానంద సాలైలో ఆందోళన చేసేందుకు నగర పోలీసులు అనుమతిచ్చారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ ఆందోళన కార్యక్రమంలో పార్టీ ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్ నేతృత్వం వహిస్తారు. అలాగే, ఆ పార్టీ ఎన్నికల నిర్వహణ విభాగం ప్రధాన కార్యదర్శి ఆదవ్ అర్జునతో పాటు 13 జిల్లాల కార్యదర్శులు, రాష్ట్ర స్థాయి నిర్వాహకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొనున్నారు. ఇందులో పార్టీ అధ్యక్షుడు విజయ్ కూడా పాల్గొనే అవకాశం ఉన్నట్టు ఆ పార్టీ వర్గాలు సూచనప్రాయంగా వెల్లడించాయి. అయితే ఆయన ఎక్కడ నిర్వహిస్తారన్నదానిపై ఉత్కంఠ కొనసాగుతోంది.



19న కోవైలో ప్రధానికి
నల్లజెండాలతో నిరసన

● రైతు సంఘాల నేత అయ్యాకన్ను



ప్యారీస్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కోవైలో ఈ నెల 19న పర్యటించనున్న ప్రధాని నరేంద్ర మోదీకి రైతు సంఘాల తరుపున నల్లజెండాలతో నిరసన తెలియజేయనున్నట్లు జాతీయ దక్షిణ భారత నదుల అనుసంధానం, రైతు సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు అయ్యాకన్ను ప్రకటించారు. తిరుచ్చిలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, కర్ణాటక రాష్ట్రంలోని కావేరి నది నుండి ప్రతిరోజు రాష్ట్రానికి నీటిని విడుదల చేయాలి, మెకెదాటులో డ్యాం నిర్మాణం నిలిపివేయాలి, పంటల బీమా పథకం అమలుపరచాలి, పంట రుణాలను మాఫీ చేయాలి తదితర ఆరు డిమాండ్లను అమలుపరచాలని కోరుతూ కోవై రానున్న ప్రధాని నరేంద్ర మోదీకి నల్లజెండాలతో నిరసన తెలియజేయనున్నట్లు తెలిపారు. పంటలకు గిట్టుబాటు ధర నిర్ణయించాలి, ప్రతి రైతును జీవిత బీమా పథకంలో చేర్చుకోవాలి తదితర కోరికలతో వచ్చే 17వ తేదీ వందలాది మంది రైతులు ఢిల్లీలో నిర్వహించనున్న ధర్నాలో పాల్గొంటారని తెలిపారు. రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు పురస్కరించుకుని తమ సంఘాల తరుపున కల్లుగీతను అనుమతించాలని కోరుతూ వచ్చే జనవరిలో మహానాడు నిర్వహించదలచినట్లు తెలిపారు.

శివగంగ జిల్లా సింగంపునరిలో పంచాయతీ కార్యాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి







జార్ఖండ్ ఆవిర్భావ దినం, గిరిజనుల ఉత్సవం సందర్భంగా రాజ్‌భవన్‌లో నృత్య కార్యక్రమాలు నిర్వహించిన జవ్వాదుమలై పాఠశాల విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న గవర్నర్ ఆర్ఎన్ రవి

డీఎంకేను విమర్శించే హక్కు
కమలనాథులకు లేదు

బీజేపీలోనూ వారసత్వ రాజకీయాలున్నాయి : స్పీకర్ అప్పావు



ప్యారీస్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): డీఎంకేను విమర్శించే హక్కు కమలనాథులకు లేదని, భారతీయ జనతా పార్టీ (బీజేపీ)లో 287 మంది వారసులు పదవుల్లో రాణిస్తున్నారని, రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ అప్పావు పేర్కొన్నారు. తిరునల్వేలి జిల్లా పనగుడి సేక్రెట్ హార్ట్ మహోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన 'నలంకాక్కుం స్టాలిన్' పథకాన్ని శనివారం ప్రారంభించిన సందర్భంగా అప్పావు మీడియాతో మాట్లాడారు. పనగుడి వళ్లియూర్, కూడన్‌కుళం, దిసయన్‌విలై తదితర నియోజకవర్గంలో నిర్వహించిన 15 శిబిరాల్లో అల్పాహారం, మధ్యాహ్న భోజనం, సాయంత్రం టీ వరకు ప్రజలకు ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. శిబిరంలో పాల్గొని ఆరోగ్య పరీక్షలు చేయించుకున్న వారి పేర్లు నమోదు చేసుకున్న ప్రత్యేక ఫైల్ కూడా అందజేసినట్లు తెలిపారు. దేశంలో పెద్ద రాజకీయ పార్టీలకు ఎన్నికల వేళ సలహాలిచ్చే ప్రశాంత్ కిషోర్ నిర్వహిస్తున్న జన సురాజ్ పార్టీ (జేఎస్పీ) బిహార్ ఎన్నికల్లో ఒక్క స్థానంలో కూడా గెలవలేదని, కొన్ని స్థానాల్లో డిపాజిట్లు కూడా కోల్పోయారని, ఆయనకు రాజకీయ భవిష్యత్తు ఉండదన్నారు. తమిళనాడులో అధికారంలో ఉన్న డీఎంకేలో, ప్రభుత్వంలో వారసులు అధికంగా ఉన్నారని బీజేపీ విమర్శించడంలో వాస్తవం లేదన్నారు. కమలం పార్టీలో ప్రస్తుతం 287 మంది వారసులు పదవుల్లో ఉన్నారని, కుటుంబ రాజకీయం గురించి బీజేపీ ప్రశ్నించడం హాస్యాస్పదంగా ఉందని అప్పావు పేర్కొన్నారు.

అన్నా వర్సిటీలో అక్రమాలు !

● 17 మందిపై ఏసీబీ కేసు నమోదు

చెన్నై, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): నగరంలోని అన్నా విశ్వవిద్యాలయ అనుబంధంగా ఏర్పాటైన కాలేజీలకు గుర్తింపు మంజూరు చేయడం, తగిన అర్హతలేని వ్యక్తులను ప్రొఫెసర్లుగా నియమించడంలో భారీ స్థాయిలో జరిగిన అవినీతి అక్రమాలపై అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు ముమ్మర దర్యాప్తు చేపడుతున్నారు. ఇప్పటికే 17 మందిపై కేసులు కూడా నమోదు చేశారు. ఇందులో భాగంగా 224 కళాశాలల యాజమాన్యాలను కూడా ఏసీబీ విచారణ జరుపుతోంది. ఈ అవినీతిలో విశ్వవిద్యాలయం మాజీ డైరెక్టర్ ఇలయపెరుమాళ్, డిప్యూటీ డైరెక్టర్ చిత్ర, మాజీ రిజిస్ట్రార్లు రవికుమార్, ప్రకాష్, నిర్వహణ కమిటీలో సభ్యులుగా వ్యవహరించిన గిరిదేవ్, మార్షల్ ఆంటోని, మాలతి, బృహదీశ్వరన్, సిలాస్ సర్గుణం, మారిసామి, కన్నన్, రవికుమార్ సహా నాలుగు ఇంజనీరింగ్ కళాశాలల నిర్వాహకులపై ఏసీబీ కేసులు నమోదు చేసింది. వీరందరికీ ప్రొఫెసర్ల నియామకాల్లో జరిగిన అవినీతి అక్రమాల్లో సంబంధాలున్నాయని ప్రాథమిక దర్యాప్తులో పేర్కొన్నారు. గుర్తింపు కోసం దరఖాస్తు పెట్టుకున్న ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలతో వీరంత కుమ్మక్కయి అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. పలు ఇంజనీరింగ్ కాలేజీలకు నిబంధనలను ఉల్లఘించి వీరి అంగీకారం ప్రకటించినట్లు ఏసీబీ దర్యాప్తులో సాక్ష్యాధారాలతో వెల్లడైందని ఏసీబీ అధికారులు చెబుతున్నారు. వీరందరిపై 7 సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.



'ముస్తాఫా ముస్తాఫా' ఫస్ట్‌లుక్ రిలీజ్



చిత్రపరిశ్రమలో తరతరాలుగా ఫీల్‌గుడ్ సినిమాలకు ప్రేక్షకుల హృదయాల్లో సుస్థిర స్థానం ఉంది. ఇపుడు ఇదే జానర్‌లో 'ముస్తాఫా ముస్తాఫా' పేరుతో ఫీల్‌గుడ్ మూవీ రూపొందుతోంది. ఈ చిత్రం ఫస్ట్‌లుక్‌ను శనివారం సినీ దర్శకులు వెంకట్ ప్రభు, రాజు మురుగన్, సంగీత దర్శకుడు డి.ఇమ్మాన్ ఆవిష్కరించారు. మాపోకోస్ కంపెనీ పతాకంపై ప్రదీప్ మహదేవాన్ నిర్మించిన ఈ సినిమాకు ప్రదీప్ శరవణన్ దర్శకత్వం వహించారు. ఈ మూవీ ఫస్ట్‌లుక్ రిలీజ్ తర్వాత చిత్ర దర్శకుడు ప్రవీణ్ మాట్లాడుతూ, 'ఈ సినిమా స్నేహితుల జీవితాలు, వారిచుట్టూ హాస్య భరితంగా సాగుతుంది. 35 రోజుల్లో చిత్రీకరణ పనులు పూర్తి చేశాం. ఎంఎస్.జోన్స్ రూబెర్ట్ మంచి సంగీతం ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకుంది. ఇందులో నాలుగు పాటలు ఉన్నాయి. పోస్ట్ ప్రొడక్షన్ నిర్మాణ పనులు పూర్తి చేసి త్వరలోనే విడుదల తేదీ వెల్లడిస్తాం' అని పేర్కొన్నారు.

సిద్ధార్థ్ - రాశీ ఖన్నా జంటగా 'రౌడీ అండ్ కో'



లొకేషన్‌లో దర్శకుడితో సిద్ధార్థ్

సిద్ధార్థ్, రాశీ ఖన్నా జంటగా తొలిసారి నటించే చిత్రానికి 'రౌడీ అండ్ కో' అనే టైటిల్ ఖరారు చేశారు. సునీల్, యోగిబాబు, రెడిన్ కింగ్‌స్లీ, ప్రాంక్ స్టార్ రాహుల్, వెట్రిమణి తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్నారు. కార్తిక్ జి క్రిష్ దర్శకత్వంలో ప్యాషన్ స్టూడియోస్ పతాకంపై సుధన్ సుందరం ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్ర విశేషాలను దర్శకుడు వివరిస్తూ, 'ఇది రౌడీల కార్పొరేట్ సామ్రాజ్యానికి సంబంధించిన స్టోరీ. అందుకే 'రౌడీ అండ్ కో' అనే టైటిల్ ఖరారు చేశాం. ఫుల్ లెంగ్త్ హాస్యభరితంగా తెరకెక్కిస్తున్నాం. తమిళం, తెలుగు, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో పాన్ ఇండియా మూవీగా రూపుదిద్దుకుంటుంది. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేశాం. మరో 15-20 రోజుల్లో పోస్ట్ ప్రొడక్షన్ పూర్తి చేస్తాం. చెన్నైలో షూటింగ్ జరుపుకున్న ఈ చిత్రం అనేక సంక్లిష్ట సంఘటనలు, తద్వారా ఏర్పడే సమస్యలను ఎంతో ఫన్నీగా చిత్రీకరించాం' అని వివరించారు.

చిత్రజ్యోతి

బంగారం ధర చూస్తేనే భయం వేస్తోంది

● ఆండ్రియా

రోజురోజుకూ పెరిగిపోతున్న బంగారం ధరలను చూస్తుంటేనే భయం వేస్తుందని ప్రముఖ హీరోయిన్ ఆండ్రియా జెర్మయ్య అంటున్నారు. కోయంబత్తూరులో ఒక నగల దుకాణం ప్రారంభోత్సవంలో ఆమె పాల్గొని మాట్లాడుతూ, 'నేను ఎంతగానో ఇష్టపడే ప్రాంతం కోయంబత్తూరు. యేడాదిలో కనీసం పదిసార్లయినా వస్తుంటాను. ఇపుడు బంగారం ధరలు చూస్తుంటేనే భయం వేస్తోంది. మున్ముందు ఎలాంటి రికార్డులు సృష్టిస్తుందో వేచి చూడాల్సిందే. నేను ప్రధాన పాత్రను పోషించిన 'మాస్క్' మూవీ ఈ నెల 21వ తేదీన విడుదలవుతుంది. ఎంతో సరదాగా ఉంటుంది. ప్రతి ఒక్కరూ థియేటర్‌కు వెళ్ళి సినిమా చూడాలని కోరుతున్నాను. హీరో విజయ్ ఒక కమాండర్ అని ఆండ్రియా పేర్కొన్నారు. ఆ తర్వాత ఆమె అక్కడకు వచ్చిన అభిమానులతో సెల్ఫీ తీసుకున్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఆండ్రియా

ఆయనకు ఆకాశమే హద్దు

● తళుకులీనేది ఆయనే

● సభలు, సమావేశాల నిర్మాణమూ ఆయనదే

● నేతలందరి నేస్తం 'పందల్' శివ



'పందల్' శివ

టి.నగర్, ఆంధ్రజ్యోతి

అసెంబ్లీ ఎన్నికలకు రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలూ సిద్ధమవుతున్నాయి. ఏ ఎన్నికలు వచ్చినా రాజకీయ పార్టీలు వాటికున్న ఆర్థిక స్థోమతను బట్టి సభలు, సమావేశాలు, మహానాడులు నిర్వహించడంలో బిజీగా ఉంటాయి. ఎన్నికలు సమీపిస్తుంటే ఆ రాజకీయ పార్టీలే కాకుండా ఆ పార్టీల నేతలకందరికీ ఆప్తమిత్రుడిగా వ్యవహరించే మరో వ్యక్తి కూడా చాలా బిజీగా మారిపోతారు. ఆయన్ని అన్ని పార్టీలపై పెత్తనం చేయగల 'వీఐపీ' అని కూడా పిలవొచ్చు. ఆయనే 'పందల్' శివ. దివంగత రాజకీయ దిగ్గజాలు కరుణానిధి, జయలలిత, విజయకాంత్ వంటి నేతల నుంచి ఎన్నోమార్లు ప్రశంసలందుకున్నారాయన. ఇక జాతీయ పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ వంటి ముఖ్య నేతలతో పాటు ప్రధాని నరేంద్ర మోదీ కూడా ఆయనకు సన్నిహితుడని చెప్పకతప్పదు.



మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి నుంచి జ్ఞాపికను స్వీకరిస్తున్న 'పందల్' శివ

రాష్ట్రంలో ఏ రాజకీయ పార్టీ అయినా మహానాడు జరపాలనుకుంటే పక్షం రోజులకు ముందు ఈ 'పందల్' శివతో డేట్ ఫిక్స్ చేసుకోవాల్సిందే! మహానాడుకు ఆయన నిర్మించే విశాలమైన వేదికలు, వేల సంఖ్యలో సీటింగ్ కెపాసిటీతో రూపొందించే పందిళ్లు చూపరులను ఇట్టే కట్టిపడేస్తాయి మరి. తన తాత, తండ్రి నుంచి నేర్చుకున్న మెళకువలతో శివ ఈ పందిళ్లు నిర్మిస్తారు. ఇలా పందిళ్లు వేసే బిజినెస్‌లో ఇప్పుడు నాలుగోతరం కూడా ప్రవేశించింది. ప్రస్తుతం శివ కుమార్తె కూడా ఆయన మార్గంలోనే పయనిస్తోంది. ఇంతమందిని సంభ్రమాశ్చర్యాల్లో ముంచెత్తుతున్న శివ విశేషాలు ఆయన మాటల్లోనే...

SUNDAY SPECIAL



డీఎంకే మహానాడు ప్రవేశద్వారం



ఓ మహానాడు పందిరి

భగవంతుడి అనుగ్రహంతోనే...

మాది తిరువారూరు జిల్లా వడువూరు. మా తాతగారు ఎండిన కొబ్బరాకులు, మట్టలతో ఇరువైపులా సవుక గుంజలు నాటి పర్ణశాల నిర్మించుకుని దాని దిగువనే పందిళ్లకు కావల్సిన ఎండిన కొబ్బరి ఆకులు, తాళ్లు, గుంజలు అమ్మేవారు. ఆ తరువాత ఇటువైపు దృష్టి సారించారు. అప్పట్లో ఆయనది ఉమ్మడి కుటుంబం కనుక నగరంలో పార్టీ సభలకు సంబంధించిన పందిళ్లు వేయడానికి కుటుంబమంతా శ్రమించేది. ఆ తర్వాత మా నాన్నగారు ఈ బిజినెస్ విస్తరించారు. నేను కాలేజీలో చదువుతున్నప్పుడే ఈ బిజినెస్‌పై ఆసక్తి పెంచుకున్నాను. నేనీ ఈ బిజినెస్‌లో అడుగుపెట్టినప్పుడు మా కంపెనీ ఎలాంటి గుంజలు లేకుండా 80 అడుగుల విస్తీర్ణం కలిగిన భారీ పందిరి వేసేది. ఇప్పుడు 171 అడుగుల విస్తీర్ణంలో పందిరి వేస్తున్నాం. పదిలక్షల మంది వరకు హాజరయ్యే భారీ మహానాడులకు కూడా అత్యంత విశాలమైన పందిళ్ళను నిర్మించాం. ఇదంతా భగవంతుడిచ్చిన అనుగ్రహం. నా మేనల్లుడు చంద్రశేఖర్, నా కుమార్తెలు యాషిని, నందిని, నా భార్య ఇలా నాకు చేదోడువాదోడుగా వుంటారు.

వెరీ సింపుల్ టెక్నిక్...

అన్ని పార్టీలతో ఎలా సన్నిహితంగా ఉండగలరని చాలా మంది అడుగుతుంటారు. ఇది చాలా సింపుల్ సార్. ఓ రాజకీయ పార్టీకి సంబంధించిన పనులు చేస్తున్నప్పుడు మరొక రాజకీయ పార్టీ నాయకుల దగ్గర ఎట్టి పరిస్థితుల్లోనూ ఆ పనుల గురించి ప్రస్తావించను. అంతే కాకుండా ఏ ఒప్పందం చేసుకున్నా, ఆయా సభల నిర్మాణం పూర్తయ్యేవరకు వారే నా బాస్ అనుకుంటాను. ప్రముఖ సినీనటుడు కెప్టెన్ విజయ్ కాంత్ మదురైలో తొలి మహానాడు పందిరి నిర్మాణ పనులు అప్పగించినప్పుడు నన్ను పిలిచి 'ఏవయ్యా నువ్వే పార్టీ?' అని ప్రశ్నించారు. వెంటనే 'మీ పార్టీ మహానాడు పనులు పూర్తయ్యేంతవరకూ మీ పార్టీకి చెందిన కార్యకర్తని' అని బదులిచ్చాను. అందుకు కెప్టెన్ చిన్న పిల్లాడిలా పకా పకా నవ్వేశారు. ఎండీఎంకే నేత వైగో డీఎంకే నుండి వైదొలగి, సొంత పార్టీ ప్రారంభించినప్పటి నుండి ఇప్పటి వరకు ఆ పార్టీ సభలు, మహానాడులకు నేనే పందిళ్లను నిర్మిస్తున్నాను.

ఎన్నో కానుకలు...

అన్ని పార్టీలతో సఖ్యతగా ఉండటం వల్లే మాజీ ముఖ్యమంత్రి జయలలిత అధికారంలో ఉన్నప్పుడు తంజావూరు ప్రపంచ తమిళ మహానాడుకు భారీ పందిరి నిర్మించి ఆమె దగ్గర ప్రశంసలందుకున్నాను. మా శ్రమను మెచ్చుకుని ఆమె విలువైన కానుకలతో మమ్మల్ని ఘనంగా సత్కరించారు. అదే విధంగా కరుణానిధి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కోయంబత్తూరులో జరిగిన సెమ్మొళి మహానాడుకు విశాలమైన అందమైన భారీ పందిరి నిర్మించాం. 'తమిళ సంస్కృతీ సంప్రదాయాలను చాటిచెప్పేలా చాల చక్కగా చేశావు ' అంటూ ఆయన ప్రశంసలతో ముంచెత్తడంతో పాటు విలువైన కానుకలను వేదికపైనే ఇచ్చి ఘనంగా సత్కరించారు. విజయకాంత్ పార్టీ మహానాడు కోసం వేసిన పందిరి చూసి.. అప్పటికప్పుడు ఆయన నాకు బంగారు ఉంగరాన్ని ఇచ్చారు. ప్రస్తుత ముఖ్యమంత్రి స్టాలిన్ డీఎంకే యువజన విభాగం అధ్యక్షుడిగా ఉన్నప్పుడు ఆ విభాగం జరిపిన అన్ని సభలు, మహానాడులకు నిర్మించిన పందిళ్ల సొగసు చూసి మెచ్చుకుని బంగారు గొలుసును మెడలో వేసి అభినందించారు.

ఈ బిజినెస్‌లోనూ గట్టి పోటీ...

రాజకీయ పార్టీలకు పందిళ్లు నిర్మించే బిజినెస్‌లోనూ గట్టి పోటీ నెలకొంది. మరో నాలుగైదు కంపెనీలు మాకు ధీటుగానే పనిచేస్తున్నాయి. కొత్త టెక్నిక్ అమలు చేయడంలోనే మేమంతా పోటీపడుతుంటాం. ఆ కంపెనీలతో పోటీ పడినా, అందరూ ఒకే సంస్థలో పనిచేస్తున్న సహోద్యోగులుగానే వ్యవహరిస్తాం. బిజినెస్‌లో జరిగే లాభనష్టాలపై, వస్తున్న మార్పులపై, కొత్త టెక్నిక్‌లు ప్రవేశపెట్టడంపై అందరం కలిసి మాట్లాడుకుంటాం. అందువల్లే మాకు ఏ కంపెనీతోనూ శత్రుత్వం లేదు. మా సంస్థలో నాలుగోతరం వ్యక్తులు పనిచేస్తున్నారు. కొత్త కొత్త టెక్నాలజీ అమలు చేయడానికి ఆసక్తి కనబరుస్తున్నారు. రాజకీయ పార్టీల సభలూ, మహానాడులకు పందిళ్లు వేయడం కూడా ఓ అద్భుతమైన కళగా పరిగణించి, రాష్ట్రప్రభుత్వం మాబోటి కళాకారులకు కూడా కలైమామణి అవార్డులు ఇస్తే బావుంటుంది.



'పందల్' శివ నిర్మించిన సభా వేదికపై ప్రధాని మోదీ, ఏడీఎంకే నేతలు ఈపీఎస్, ఓపీఎస్

నెల్లయప్పర్ ఆలయంలో ఐప్పసి తిరుకల్యాణోత్సవం



ఆదిదంపతుల కల్యాణశోభ

చెన్నై, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): తిరునల్వేలి నగరం నడిబొడ్డున ఉన్న సుప్రసిద్ధ నెల్లయప్పర్ ఆలయంలో ఐప్పసి తిరుకల్యాణోత్సవం శనివారం ఉదయం అత్యంత వైభవంగా జరిగింది. ఈ ఆలయంలో ఐప్పసి తిరుకల్యాణోత్సవాలు ఈ నెల 4న ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. శుక్రవారం అర్ధరాత్రి 1.30 గంటలకు నెల్లయప్పర్ ఆలయం నుండి కాంతిమది అమ్మవారు తపో భంగిమలో స్వర్ణ సప్పరంలో ఊరేగారు. దక్షిణ రథవీధి, పేట్టై రోడ్డు మీదుగా శనివారం వేకువజాము 5 గంటలకు కంబానది కామాక్షి అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. ఈ నేపథ్యంలో శనివారం వేకువజాము అమ్మవారి సన్నిధిలో ఉన్న వేయికాళ్లమంటపంలో తిరుకళ్యాణోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఈ వేడుకల్లో వేలాదిమంది భక్తులు పాల్గొన్ని ఆలయాన్ని దర్శించుకున్నారు. ఉదయం 9.30 గంటలకు స్వామి - అమ్మవారు పూల పల్లకీలో నగర ప్రవేశం చేశారు. ఇక శనివారం నుండి సోమవారం వరకు అమ్మవారికి ఊంజల్ సేవలు కూడా జరుగుతాయి.

ఏపీలో కార్బోనాటిక్ పెట్టుబడులు



ఏపీ సీఎం చంద్రబాబు నాయుడుతో కార్బోనాటిక్ ప్రతినిధులు ఆనంద్, శేఖర్, తాళ్లూరి సురేష్

ప్యారీస్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమక్షంలో పరివర్తన బహుళ రంగ ప్రాజెక్టుల అవగాహన ఒప్పందంలో భాగంగా కార్బోనాటిక్ ఎల్ఎల్‌సీ మూడు కీలక రంగాల్లో గణనీయమైన పెట్టుబడులు పెట్టింది. విశాఖపట్నంలో శుక్రవారం ప్రారంభమైన సీఐఐ భాగస్వామ్య సమ్మిట్-2025 సందర్భంగా విమానయానం, ఇంధనం, మౌలిక సదుపాయాలు, సముద్రం, మైనింగ్, సాంకేతిక రంగాల్లో విభిన్న పోర్ట్ పోలియోతో కూడిన యూఎస్ ఐ-ఆధారిత ప్రపంచ సమ్మేళనం కార్బోనాటిక్ ఎల్ఎల్‌సీ రూ.31,500 కోట్ల విలువైన పెట్టుబడుల కోసం ఏపీ ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది, సీఎం చంద్రబాబు నాయుడు, రాష్ట్రమంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి సమక్షంలో ఏపీ ప్రభుత్వ అధికారులు, కార్బోనాటిక్ ఎల్ఎల్‌సీ ఛైర్మన్ ఆనంద్, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ శేఖర్, అనలిస్ట్ తాళ్లూరి సురేష్ ఈ ఒప్పందపత్రాలు మార్చుకున్నారు.

మార్కెట్లోకి 'నెక్స్ట్‌ఫేస్'



చెన్నై, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మార్కెట్లోకి మొట్టమొదటి ఏఐ ఆధారిత జెన్‌జీ చర్మ సంరక్షణ బ్రాండ్ 'నెక్స్ట్‌ఫేస్' ఉత్పత్తి విడుదలైంది. శుక్రవారం నగరంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ప్రముఖ సినీ నటి కయదు లోహర్ దీనిని లాంఛనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకురాలు, సీఈవో దమయంతి కుమారవేల్, వీణా కుమారవేల్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దమయంతి మాట్లాడుతూ.. నెక్స్ట్‌ఫేస్ దేశంలోనే మొట్టమొదటి రియల్ టైమ్, కెమెరా యాక్టివేటెడ్ ఏఐ స్కిన్‌కేర్ ఇంటర్‌ఫేస్ కూడా పరిచయం చేస్తుందని తెలిపారు. తాను నెక్స్ట్‌ఫేస్‌తో పూర్తిగా కనెక్ట్ అయినట్లు కయదు లోహర్ వ్యాఖ్యానించారు.

విదేశీ భాషలు నేర్చుకోండి

● ఆర్ఎంకే విద్యాసంస్థల ఛైర్మన్ మునిరత్నం



సావనీర్ విడుదల చేస్తున్న ఆర్ఎస్ మునిరత్నం తదితరులు

తిరువళ్లూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు విదేశీ భాషలను నేర్చుకోవాలని ఆర్ఎంకే విద్యాసంస్థల ఛైర్మెన్ ఆర్ఎస్ మునిరత్నం సూచించారు. తిరువళ్లూరు జిల్లా కవరపేటలోని ఆర్ఎంకే కళాశాలలో ఇంజనీరింగ్ పూర్తిచేసిన పూర్వ విద్యార్థుల 20వ అలూమిని మీట్ శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమంలో 2014వ బ్యాచ్ విద్యార్థి వెంకటసుబ్రమణ్యం ప్రారంభోపన్యాసం చేయగా, విద్యాసంస్థల ఛైర్మెన్ ఆర్ఎస్ మునిరత్నం అధ్యక్షత వహించారు. వార్షిక నివేదికను స్టాఫ్ సెక్రటరీ హరిహరన్ ప్రవేశపెట్టారు. కార్యక్రమంలో విద్యాసంస్థల వైస్ ఛైర్మెన్ ఆర్ఎం కిషోర్ మాట్లాడుతూ.. ప్రపంచ వ్యాప్తంగా ఇంజనీర్లకు డిమాండ్ వుందన్నారు. ఇంజనీరింగ్ విద్యార్థులు కేవలం మార్కుల కోసం చదవకుండా ప్రయోగాలు, పరిశోధనలపై ఆసక్తి చూపాలని సూచించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఆర్ఎస్ మునిరత్నం మాట్లాడుతూ... ఫ్రాన్స్, జపనీస్ వంటి భాషలకు ఎక్కువ డిమాండ్ వుందని, ఉద్యోగ భవిష్యత్తు దృష్ట్యా విద్యార్థులు విదేశీ భాషలు నేర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పూర్వపు విద్యార్థులకు జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి యలమంచి ప్రదీప్ , డీన్‌లు రామర్, శివరామ్, ప్రిన్సిపాల్ సురేష్‌కుమార్, సలహాదారు మనోహర్, మాజీ ఐఏఎస్ అధికారులు పిచ్చాండి, పళనిస్వామి తదితరులు హాజరైయ్యారు.

ప్రథమ చికిత్సపై అవగాహన అవసరం

● డాక్టర్ అనిత

ప్యారీస్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): అనుకోకుండా జరిగే ప్రమాదాల్లో చిక్కుకున్న బాధితులను ఆస్పత్రికి తరలించేలోగా సంఘటన స్థలంలో చేపట్టాల్సిన ప్రథమ చికిత్సపై ప్రతి ఒక్కకి అవగాహన ఉండాలని నగరంలోని అపోలో చిల్డ్రెన్స్ ఆస్పత్రి ఈఆర్ కన్సల్టెంట్ డాక్టర్ అనితా తరిగోపుల సూచించారు. తమిళనాడు ఆర్యవైశ్య మహిళా సభ మద్రాస్ యూనిట్ ఆధ్వర్యంలో చూలైలో ఎస్‌కేపీడీ నిర్వహణలోపి మహర్షి విద్యామందిర్‌లో అపోలో ఆస్పత్రి సహకారంతో సీపీఆర్ డెమాన్‌స్ట్రేషన్‌పై ప్రత్యేక శిబిరం నిర్వహించారు. పాఠశాల ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది, ప్రిన్సిపల్ పి.సుబ్రమణ్యం, వైస్ ప్రిన్సిపల్ ఎం.కవిత, మేనేజర్ ఎ.శ్రీలత, తమిళనాడు ఆర్యవైశ్య మహిళా సభ మద్రాస్ యూనిట్ అధ్యక్షురాలు ప్రశాంతి, కార్యదర్శి భార్గవి, ట్రెజరర్ ప్రసన్న, వైస్ ఛైర్‌పర్సన్ మల్లిక, పాస్ట్ ఛైర్‌పర్సన్ పి.మణిమాలారావు తదితరులు ఈ శిబిరంలో పాల్గొన్నారు. శిబిరంలో మూర్ఛ బాధితులు, మంటల్లో చిక్కుకున్నవారు, కుక్క, పాము కాటుకు గురైనవారికి ఎలాంటి ప్రథమ చికిత్స చేయాలి? తదితర అంశాలపై క్లోన్స్ సహాయంతో అవగాహన కల్పించారు. అలాగే చిన్నారులు, మహిళలు, సీనియర్ సిటిజన్ల సంరక్షణ, ఆరోగ్య సూత్రాల గురించి డాక్టర్ అనిత, ఏఎస్‌సీ ఇన్‌స్ట్రక్టర్ దుర్గాదేవి ఏలుమలై, ఏఎస్ఎఫ్ నర్సింగ్ ఆఫీసర్ లిబా మెళకువలు నేర్పారు.



అవగాహన శిబిరంలో వైద్య బృందం, కమిటీ నిర్వాహకులు, టీచర్లు

ఘనంగా సహకార సంఘ వార్షికోత్సవం

వేలూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లా మహిళా సహకార సంఘ 72వ వార్షికోత్సవ వేడుకలు శనివారం ఉదయం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ఎంపీ కదిర్ ఆనంద్, ఎమ్మెల్యేలు నందకుమార్, అమ్ములు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ సుబ్బులక్ష్మి నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో సహకార సంఘ జిల్లా జాయింట్ డైరెక్టర్ తిరుగుణ అయ్యప్పదురై మాట్లాడుతూ, అనైకట్టు సమీపంలోని ఏంజమండ్రై ప్రాంతంలో త్వరలోనే నూతన సహకార సంఘ భవన నిర్మాణానికి భూమిపూజ చేయనున్నట్లు తెలిపారు. అనంతరం ఎంపీ కదిర్ ఆనంద్ చేతుల మీదుగా 2,757 మంది మహిళలకు రూ.20.69 కోట్ల సంక్షేమ సహాయాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కార్తికేయన్, వేలూరు కార్పొరేషన్ మేయర్ సుజాత, డిప్యూటీ మేయర్ సునీల్‌కుమార్, పంచాయతీ అధ్యక్షుడు బాబు, వన్నియ రాజా తదితరులు పాల్గొన్నారు. ఇదిలా వుండగా, తనకు చెప్పకుండా తన నియోజకవర్గంలో నిర్మాణాల గురించి ప్రకటించడం ఏమిటని అనైకట్టు నియోజకవర్గ ఎమ్మెల్యే నందకుమార్ ప్రశ్నించారు.



మహిళలకు సహాయాలు పంపిణీ చేస్తున్న ఎంపీ కదిర్ ఆనంద్ తదితరులు

గురుప్రియ విజన్ రీసెర్చి ఫౌండేషన్‌కు వ్యాన్ వితరణ

పెరంబూర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక టి.నగర్‌లోని రాధాత్రి నేత్రాలయ ఆధ్వర్యంలో పనిచేస్తున్న గురుప్రియ విజన్ రీసెర్చి ఫౌండేషన్‌కు చెన్నైకి చెందిన మహావీర్ జైన్ ఇంటర్నేషనల్ మిషన్ వ్యాన్‌ను విరాళంగా అందజేసింది. రాధాత్రి నేత్రాలయ ప్రాంగణంలో శనివారం జరిగిన కార్యక్రమంలో మహావీర జైన్ ఇంటర్నేషనల్ మిషన్ నిర్వాహకులు సుభాస్‌చంద్ రాంకా, కృష్ణశ్రీ శ్రీమల్ జైన్, గిరీష్ బండారి, నిర్మలా నాహర్ సహా పలువురు సభ్యులు రాధాత్రి నేత్రాలయ మెడికల్ డైరెక్టర్ డా.ప్రవీణ కృష్ణకు వ్యాన్ అందించారు. ఈ సందర్భంగా డా.ప్రవీణ కృష్ణ మాట్లాడుతూ... పుట్టుకతో 'రెటీనోపతి ఆఫ్ ప్రెమాట్యూరిటీ (ఆర్వోపీ) సమస్యతో కంటి చూపు కోల్పోయే అవకాశమున్న పేద కుటుంబాల చిన్నారులకు ఉచిత వైద్యం అందిస్తున్నారు. ఈ వ్యాన్ ద్వారా నగరం చుట్టుపక్కల 375 కి.మీ దూరంలోని గ్రామాలకు వెళ్లి పరీక్షలు నిర్వహించి, ఆర్వోపీ సమస్యతో బాధపడుతున్న చిన్నారులను గుర్తించి, నగరానికి తీసుకొచ్చి చికిత్సలు అందించనున్నట్లు డా.ప్రవీణ కృష్ణ తెలిపారు.



రాధాత్రి నేత్రాలయ మెడికల్ డైరెక్టర్ డా.ప్రవీణ కృష్ణకు వ్యాన్ అందిస్తున్న ట్రస్ట్ నిర్వాహకులు

సమాచార దృష్టి

నానో సైన్స్ టెక్నాలజీలో ఆన్‌లైన్ కోర్సు

పెరంబూర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ విద్యార్థులకు ఆన్‌లైన్‌లో నానో సైన్స్ టెక్నాలజీ కోర్సు అందించనున్నారు. ఈ మేరకు అన్నా విశ్వవిద్యాలయం విడుదల చేసిన ప్రకటనలో... అన్నా వర్సిటీ పరిధిలోని అళగప్ప కాలేజ్ ఆఫ్ టెక్నాలజీ (ఏసీ టెక్)లోని సెంటర్ ఫర్ నానో సైన్స్ అండ్ టెక్నాలజీలో ఈ నెల 26 నుంచి డిసెంబరు 9వ తేది వరకు నానో సైన్స్ అండ్ టెక్నాలజీపై స్వల్పకాలిక కోర్సు అందిస్తున్నామని తెలిపింది. ఈ కోర్సులో యూజీ, పీజీ ఇంజనీరింగ్ విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యావేత్తలు, పరిశోధకులు చేరవచ్చని తెలిపింది. నానో టెక్నాలజీ ప్రాథమిక అంశాలు, ఈ టెక్నాలజీలో వస్తున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం తదితరాలపై ఈ కోర్సు ఉంటుంది. ఆసక్తి కలిగిన వారు 8098953365 అనే నెంబరుకు సంప్రదించి ఈ నెల 18వ తేదిలోగా పేర్లు నమోదుచేసుకోవాలని అన్నా వర్సిటీ తెలియజేసింది.

గ్రూప్-4 అభ్యర్థుల సర్టిఫికెట్ అప్‌లోడ్‌కు అవకాశం

పెరంబూర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-4లో ఉత్తీర్ణులైన వారు ఒరిజినల్ సర్టిఫికెట్ల అప్‌లోడ్‌కు అవకాశం కల్పించారు. ఈ మేరకు తమిళనాడు ప్రభుత్వ ఉద్యోగుల ఎంపిక కమిషన్ (టీఎన్‌పీఎస్సీ) కార్యదర్శి గోపాల సుందరరాజ్ విడుదల చేసిన ప్రకటనలో... టీఎన్‌పీఎస్సీ ఆధ్వర్యంలో గ్రూప్-4 పోస్టుల భర్తీకి రాతపరీక్ష నిర్వహించామన్నారు. ఈ పరీక్షలో ఉత్తీర్ణులైన అభ్యర్థులు, దరఖాస్తు సమయంలో జతచేసిన సర్టిఫికెట్లు, ఉత్తీర్ణత అనంతరం ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన సర్టిఫికెట్లలో తేడాలున్నాయని తెలిపారు. అలాంటి అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు ఈ నెల 23వ తేది రాత్రి 11.59 గంటల్లోగా అప్‌లోడ్ చేసేందుకు అవకాశం కల్పించామన్నారు. ఈ గడువు మరింత పొడిగించే అవకాశముండదని, ఈ చివరి అవకాశాన్ని అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని టీఎన్‌పీఎస్సీ సూచించింది.

మూడు వేల మంది జాలర్లకు ‘లైఫ్ జాకెట్లు’

పెరంబూర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం, జాలర్లకు 75 శాతం రాయితీతో అందించేందుకు 3వేల లైఫ్ జాకెట్లు సిద్ధంగా ఉన్నాయని మత్స్యశాఖ అధికారులు తెలిపారు. సముద్రంలో చేపల వేటకు వెళ్లే సమయంలో, పడవ బోల్తాపడడం సహా పలు ఘటనల్లో జాలర్లు మృతిచెందిన ఘటనలు జరుగుతున్నాయి. ఈ మరణాలు అరికట్టేలా, పడవలో వెళ్లే అందరు జాలర్లు తప్పనిసరిగా లైఫ్ జాకెట్లు ధరించాలని రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది. అలాగే, రాష్ట్ర ప్రభుత్వం తరఫున జాలర్లకు 24వేల లైఫ్ జాకెట్లు అందిస్తామని బడ్జెట్‌లో ప్రకటించింది. ఆ ప్రకారం, ఒక్కో పడవకు నాలుగు లైఫ్ జాకెట్లు అందించనున్నారు. ఒక్కో లైఫ్ జాకెట్ విలువ రూ.2,472 కాగా, 80 శాతం రాయితీ కల్పించి, మిగిలిన రూ.618 జాలర్లు చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ విషయమై మత్స్యశాఖ అధికారులు మాట్లాడుతూ... ఇప్పటివరకు 21వేల లైఫ్ జాకెట్లు పంపిణీ చేశామన్నారు. ప్రస్తుతం లైఫ్ జాకెట్లు కోరుతూ 3వేల దరఖాస్తులు అందాయని, వారికి త్వరలో లైఫ్ జాకెట్లు అందజేయనున్నట్లు అధికారులు తెలిపారు.

జనవరిలో మరో 270 విద్యుత్ బస్సులు

పెరంబూర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది జనవరి నుంచి కొత్తగా 270 విద్యుత్ బస్సులు అందుబాటులోకి రానున్నాయని మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (ఎంటీసీ) అధికారులు తెలిపారు. ఈ విషయమై ఎంటీసీ అధికారులు మాట్లాడుతూ... ప్రపంచ బ్యాంక్, ఆసియా అభివృద్ధి బ్యాంక్ ఆర్థికసాయంతో రూ.697 కోట్లతో 625 విద్యుత్ బస్సులు నడపాలని నిర్ణయించగా, ప్రస్తుతం 255 బస్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. మరో విడతలో పూందమల్లి, పల్లవన్ హౌస్ డిపోల నుంచి 270 బస్సులు నడపాలని నిర్ణయించామన్నారు. వాటిలో 125 బస్సులు ఈ నెలాఖరులోపు, పల్లవన్ హౌస్ నుంచి 145 బస్సులు జనవరి నుంచి నడపనున్నామని తెలిపారు. ఈ బస్సులు అందుబాటులోకి వస్తే, ప్రయాణికులకు అదనపు బస్సు సదుపాయంతో పాటు 30 శాతం ఇంధన ఖర్చులు ఆదా అవుతాయని అధికారులు తెలిపారు.

తోపుడు బండ్ల దుకాణాలకు ‘ఎఫ్ఎస్ఎస్ఏఐ’ సర్టిఫికెట్ తప్పనిసరి

పెరంబూర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా తోపుడు బండ్లపై ఆహార పదార్థాలు విక్రయిస్తున్న వారికి ‘ఎఫ్ఎస్ఎస్ఏఐ’ సర్టిఫికెట్ తప్పనిసరని ఆహార భద్రతా శాఖ ప్రకటించింది. తయారీ, స్టోరేజీ, పంపిణీ, ఆహార పదార్థాల విక్రయాలకు ‘ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఐఏ) అనే సర్టిఫికెట్ ఉండాలి. ఈ విషయమై ఆహార భద్రతా శాఖ విడుదల చేసిన ప్రకటనలో... పానీపూరి, వడ, సూప్, చికెన్ పకోడా తదితరాలు విక్రయించే తోపుడు బండ్ల యజమానులు తప్పనిసరిగా ఈ సర్టిఫికెట్ పొందాలన్నారు. ఆన్‌లైన్, ఈ-సేవా కేంద్రాల్లో దరఖాస్తులు సమర్పించి, ఈ సర్టిఫికెట్ ఉచితంగా పొందవచ్చని తెలిపింది.

నిమిషాల్లో ముగిసిన పొంగల్ రిజర్వేషన్

పెరంబూర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పొంగల్ రిజర్వేషన్ ప్రారంభమైన కొద్ది నిమిషాల్లోనే ముగిసింది. ప్రతి ఏడాది పొంగల్, దీపావళి పండుగలకు నగరంలో నివసిస్తున్న వారు కుటుంబాలతో స్వగ్రామాలకు వెళ్తుంటారు. వచ్చే ఏడాది జనవరి 14న బోగి, 15న పొంగల్, 16న కనుమ, 17న కానుం పొంగల్ రానున్నాయి. ఈ క్రమంలో, పొంగల్ ముందస్తు రిజర్వేషన్ శనివారం ఉదయం 8 గంటలకు ప్రారంభమైంది. ప్రయాణికులు అధికంగా ఆన్‌లైన్‌లో రిజర్వేషన్ చేసుకోవడంతో, బుకింగ్ ప్రారంభమైన 5 నిమిషాల్లోనే వెయిటింగ్ లిస్ట్ చూపించింది. ఈ కారణంగా తెల్లవారుజాము నుంచే కౌంటర్ల వద్ద క్యూలైన్లలో వేచిన ప్రయాణికులు నిరాశకు గురయ్యారు.



వళ్లువర్‌కోట్టమ్‌ను సందర్శించి, అక్కడి శిల్పరథం దగ్గర గ్రూప్‌ఫొటో తీసుకుంటున్న మధురవాయల్ భారతి మెట్రిక్యులేషన్ పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు.

చేపలవేటకు వెళ్లని మత్స్యకారులు

రామేశ్వరం, పాంబన్‌లో పెనుగాలులు

చెన్నై, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రామనాథపురం జిల్లా రామేశ్వరం, పాంబన్ సముద్రతీరాల్లో పెనుగాలులు కారణంగా శనివారం మత్స్యకారులు చేపలవేటకు వెళ్లలేదు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పవాయుపీడన ద్రోణి ప్రభావంతో ఈ రెండు ప్రాంతాల్లో సముద్ర ఉపరితలంపై గంటకు 40 కి.మీ.ల కంటే వేగంగా పెనుగాలులు వీస్తాయని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరించడంతో శనివారం వేకువజాము చేపలవేటకు సిద్ధమైన మత్స్యకారులకు మత్స్య శాఖ అధికారులు టోకెన్ల పంపిణీ నిలిపివేశారు. దీంతో మత్స్యకారులు చేపలవేటకు వెళ్లకుండా తిరుగుముఖం పట్టారు. గత రెండురోజులుగా రామేశ్వరం, పాంబన్, మండపం ప్రాంతాల వద్ద చెదురుమదురుగా వర్షాలు కురుస్తున్నాయి. దీనికి తోడు శనివారం వేకువజాము నుంచే తీరం పొడవునా పెనుగాలులు వీస్తూ అలలు తీరం వైపు ఎగసిపడుతున్నాయి. వీటన్నింటిని పరిశీలించిన మీదటే స్థానిక మత్స్యశాఖ అధికారులు చేపలవేటపై నిషేధం అమలు చేశారు. ఈ కారణంగా రామేశ్వరం, పాంబన్ తీరాల వద్ద జాలర్లు తమ పడవలను లంగరేసి ఉంచారు. ప్రస్తుతం రామేశ్వరం రేవు, పాంబన్ రేవు తదితర రేవులన్నీ నిర్మానుష్యంగా మారాయి.



పాంబన్ రేవు వద్ద నిలిచి ఉన్న పడవలు

పార్టీ గుర్తింపుపై సుప్రీం కోర్టుకు రాందాస్?



అడయార్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పీఎంకే గుర్తింపు వ్యవహారంపై ఆ పార్టీ వ్యవస్థాపకుడు డాక్టర్ రాందాస్ సుప్రీంకోర్టును ఆశ్రయించాలన్న ఆలోచనలో ఉన్నట్టు సమాచారం. ఇదే విషయంపై దిండివనం సమీపంలోని తైలాపురం గార్డెన్‌లో పార్టీ ముఖ్య నేతలు, సీనియర్ న్యాయవాదులతో ఆయన సమాలోచన చేస్తున్నారు. తండ్రీ కొడుకుల మధ్య ఏర్పడిన ఆధిపత్యపోరులో పీఎంకే రెండుగా చీలిపోయింది. అదేసమయంలో వచ్చే యేడాది అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో ఎన్నికల గుర్తు ‘మామిడి పండు’ తమకే కేటాయించాలని ఇరువర్గాలు ఎన్నికల సంఘానికి వినతులు సమర్పించాయి. ఈ నేపథ్యంలో శనివారం పార్టీ ముఖ్య నేతలతో రాందాస్ సమాలోచన జరిపారు. ఇందులో ఆ పార్టీ న్యాయవాదులు కూడా పాల్గొన్నారు. పార్టీ గుర్తింపుతో పాటు ఎన్నికల గుర్తు కోసం సుప్రీంకోర్టును ఆశ్రయించే విషయాన్ని రాందాస్ వెల్లడించినట్టు సమాచారం. ఇదే విషయంపై ఈ నెల 18, 19వ తేదీల్లో వరుసగా రెండు రోజుల పాటు పార్టీ విభాగాల నేతలతో సమావేశమై వారి అభిప్రాయం తీసుకోవాలని రాందాస్ నిర్ణయించినట్టు సమాచారం.

బిహార్ తరహాలోనే రాష్ట్ర ఎన్నికల ఫలితాలు

● అన్నాడీఎంకే నేత, ఎమ్మెల్యే పొల్లాచ్చి జయరామన్



ప్యారీస్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): బిహార్ ఎన్నికల తరహాలోనే తమిళనాడులో 2026లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో అన్నాడీఎంకే నేతృత్వంలోని ఎన్డీయే కూటమి మెజారిటీ విజయం సాధించి ఎడప్పాడి పళనిస్వామి ముఖ్యమంత్రి అవుతారని ఎమ్మెల్యే పొల్లాచ్చి జయరామన్ జోస్యం చెప్పారు. ఆయన తిరుప్పూర్‌లో శనివారం మీడియాతో మాట్లాడుతూ, గత నాలుగున్నరేళ్లుగా అధికారంలో కొనసాగుతున్న డీఎంకే ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధికి, ప్రజలకు ఎలాంటి మేలు చేయలేదని ఆరోపించారు. బిహార్ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే 202 సీట్లలో ఘన విజయం సాధించిందని, వచ్చే ఏడాది జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో అన్నాడీఎంకే సారథ్యం వహిస్తున్న పార్టీలు 200లకు పైగా స్థానాల్లో విజయం సాధిస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తంచేశారు. నకిలీ ఓట్ల తో 2021లో అధికారంలోకి వచ్చిన డీఎంకే, దాని మిత్రపక్షాలకు రాష్ట్రంలో నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ వల్ల ఓడిపోతామన్న భయం పట్టుకుందని, అందువల్లే వారు ఎస్ఐఆర్‌ను వ్యతిరేకిస్తున్నారని జయరామన్ అన్నారు.

శ్రీహెర్ రేడియాలజీ విభాగానికి యూరోపియన్ అక్రెడిటేషన్

చెన్నై, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ‘శ్రీ రామచంద్ర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్’ (శ్రీహెర్) రేడియాలజీ విభాగం యూరోపియన్ యూనియన్ అక్రెడిటేషన్ పొందింది. ఈ మేరకు ఇటీవల యూరోపియన్ ట్రైనింగ్ అక్రిడిటేషన్ ప్రోగ్రామ్ ప్రతినిధులు సర్టిఫికెట్ అందజేశారు. ఈ గుర్తింపు పొందిన ఆసియాలో మొట్టమొదటి వైద్య సంస్థ శ్రీహెర్ కావడం విశేషం. రేడియాలజీ విభాగం ‘యూరోపియన్ సొసైటీ ఆఫ్ రేడియాలజీ - యూరోపియన్ శిక్షణ పాఠ్యాంశాలు’ (ఈఎస్ఆర్-ఈటీసీ)లో స్థాపించబడిన సూత్రాల ప్రకారం శిక్షణ ప్రమాణాలను కలిగి వుంది. దీని గురించి శ్రీహెర్ రేడియాలజీ విభాగాధిపతి డాక్టర్ పీఎం వెంకటసాయి మాట్లాడుతూ.. ఈ అక్రెడిటేషన్ స్వచ్ఛంద దరఖాస్తు, డయాగ్నస్టిక్ రేడియాలజీ, రేడియేషన్ ప్రొటెక్షన్, ఇంటర్వెన్షనల్ రేడియాలజీ, రేడియాలజీ విద్య, పరిశోధనలో నైపుణ్యం, నాణ్యమైన మౌలిక సదుపాయాల స్థాయి ఆధారంగా ఇచ్చారని తెలిపారు.

నకిలీ పత్రాలతో మోసం చేసిన ముఠా అరెస్ట్



ముఠా నుండి స్వాధీనం చేసుకున్న నకిలీ డాక్యుమెంట్లు, పరికరాలు

ప్యారీస్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఓ పారిశ్రామిక వేత్త మృతిచెందినట్లు నకిలీ ధ్రువపత్రాన్ని సృష్టించి, ఆయనకు చెందిన రూ.2కోట్ల విలువైన స్థలాన్ని విక్రయించి మోసం చేసిన ఓ ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. స్థానిక టి.నగర్‌కు చెందిన పారిశ్రామికవేత్త సుబ్రమణి (55)కు మడిపాక్కం ప్రాంతంలో సుమారు 4,715 చదరపు అడుగుల విస్తీర్ణంలో రెండు ఖాళీస్థలాలున్నాయి. వీటిని అపహరించాలని పథకం వేసిన ఓ ముఠా సుబ్రమణి మృతిచెందినట్లు నకిలీ పత్రాన్ని సృష్టించింది. అనంతరం కేకేనగర్‌లో ఉన్న ప్రియా అనే మహిళను సుబ్రమణి వారసురాలిగా నకిలీ ధ్రువపత్రం సృష్టించి దీనిని వేళచ్చేరిలో ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్టర్ చేయించి వేరే వ్యక్తికి రూ.2కోట్లకు విక్రయించి మోసానికి పాల్పడింది. ఈ విషయం తెలుసుకున్న సుబ్రమణి ఆగస్టులో పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. కమిషనర్ అరుణ్ ఆదేశాల మేరకు ఏర్పాటైన ప్రత్యేక బృందం విచారణ వేగవంతం చేసి కేకే నగర్‌కు చెందిన రాకేష్, మడిపాక్కంకు చెందిన రాజీవ్, భారతీరాజా, జక్బర్ సాదిక్‌లు ఈ మోసంలో కీలకపాత్ర పోషించినట్లు గుర్తించింది. వారు తమ మిత్రులు వెంకటేశన్, బాలసుందర ఆర్ముగమ్, సాల్మాన్‌రాజ్‌లతో కలిసి సుబ్రమణి స్థలాలకు సంబంధించి ఒరిజినల్ డాక్యుమెంట్లను ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసి దాని లాగే నకిలీ డాక్యుమెంట్‌ను తయారు చేసి నిర్మల్‌కుమార్‌కు రూ.1.55 కోట్లకు విక్రయించి మోసం చేసిన విషయం వెలుగు చూసింది. ఈ ముఠాను ఈ నెల 12న అరెస్ట్ చేసి నకిలీ దస్తావేజులకు వినియోగించిన ప్రింటర్, రబ్బర్ స్టాంపులు, పత్రాలను స్వాధీనం చేసుకున్నారు.

వైద్యకళాశాలల నిర్మాణంలో అక్రమాలు

● ఈపీఎస్‌పై సీబీఐ విచారణ కోరుతూ పిటిషన్

చెన్నై, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): గత అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో ప్రజాపనుల శాఖ మంత్రిగా పనిచేసిన మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) 11 వైద్య కళాశాలల నిర్మాణ పనుల్లో భారీగా అవినీతికి పాల్పడ్డారనే ఆరోపణలపై సీబీఐ విచారణ జరపాలని కోరుతూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. తిరువారూరు జిల్లా నన్నిలం ప్రాంతానికి చెందిన రాజశేఖరన్ అనే సామాజిక కార్యకర్త ఈ పిటిషన్ వేశారు. ఈపీఎస్ ప్రజాపనుల శాఖ మంత్రిగా ఉన్నప్పుడు తిరువళ్లూరు, అరియలూరు, కళ్ళకురిచ్చి, నామక్కల్, రామనాథపురం, దిండుగల్, నాగపట్టినం, విరుదునగర్, తిరుప్పూరు, కృష్ణగిరి, నీలగిరి జిల్లాల్లో వైద్యకళాశాలల భవనాలను నిర్మించారు. ఈ భవనాలను జాతీయ వైద్య మండలి నిబంధనలను ఉల్లఘించి నిర్మించినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ ఆరోపణలపై ఏసీబీకి ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయిందని, కనుక సీబీఐ విచారణకు ఆదేశాలివ్వాలని పిటిషనర్ కోరారు. ఈ పిటిషన్ త్వరలో విచారణకు రానున్నదని హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ కార్యాలయం అధికారులు తెలిపారు.

తిరుత్తణి మురుగన్ సేవలో రజనీ కుమార్తె ఐశ్వర్య

తిరుత్తణి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): తిరుత్తణి సుబ్రమణ్యస్వామి ఆలయాన్ని ప్రముఖ నటుడు రజనీకాంత్ కుమార్తె ఐశ్వర్య సందర్శించారు. శనివారం ఆలయానికి వచ్చిన ఐశ్వర్య, వినాయక పెరుమాళ్, ఉత్సవమూర్తి సన్నిధుల్లో పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు ఆమెకు తీర్థప్రసాదాలు అందజేశారు.



ఐశ్వర్యకు ప్రసాదం అందజేస్తున్న అర్చకుడు

లైంగిక వేధింపుల కేసులో 20 ఏళ్ల జైలు

పెరంబూర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన వ్యక్తికి 20 ఏళ్ల జైలుశిక్ష విధిస్తూ న్యాయస్థానం తీర్పునిచ్చింది. కన్నియకుమారి జిల్లా కల్లడివిళై ప్రాంతానికి చెందిన వినోద్ 11 ఏళ్ల బాలికపై 2020 మే 22వ తేది లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. ఈ విషయమై బయటకు చెబితే హతమారుస్తానని బాలికను బెదిరించాడు. ఆ బాలిక విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పడంతో వారు కుళచ్చల్ మహిళా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై విచారించిన పోలీసులు, పోక్సో చట్టంపై కేసు నమోదుచేసి వినోద్‌ను అరెస్ట్ చేశారు. ఈ కేసు విచారణ నాగర్‌కోయిల్‌లోని పోక్సో కోర్టులో ముగిసిన నేపథ్యంలో నిందితుడు వినోద్‌కు 20 ఏళ్ల జైలుశిక్ష, రూ.6 వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి సుందరయ్య శుక్రవారం తీర్పు చెప్పారు.

హత్యాయత్నం కేసులో...

హత్యాయత్నం కేసులో న్యాయవాదికి ఎనిమిదేళ్ల జైలుశిక్ష విధిస్తూ న్యాయస్థానం తీర్పు వెలువరించింది. మదురై బైపాస్ రోడ్డు ప్రాంతంలో హోటల్ నడుపుతున్న గౌరికృష్ణకు, న్యాయవాది కార్మేగంకు విభేదాలున్నాయి. 2016 ఏప్రిల్ 23న కార్మేగం హోటల్‌కు వెళ్లి మేనేజర్‌తో గొడవ పడ్డాడు. తన కారును హోటల్ లోపలికి నడిపి, అక్కడి వస్తువులు, సామాన్లను చిందరవందర చేశాడు. ఈ ఘటనలో హోటల్‌లో పనిచేస్తున్న పలువురు గాయపడ్డారు. దీనిపై ఎస్ఎస్ కాలనీ పోలీసులు కార్మేగంపై హత్యాయత్నం కేసు నమోదుచేశారు. ఈ కేసు మదురై 5వ అదనపు సెషన్స్ కోర్టులో విచారణ జరుగుతోంది. ఈ కేసు విచారణ ముగియడంతో న్యాయవాది కార్మేగంకు 8 ఏళ్ల జైలుశిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి జోసఫ్ జాయ్. శుక్రవారం తీర్పు వెలువరించారు.

శ్రీలంకలో అనుకూలించని వాతావరణం

● చెన్నై నుంచి బయల్దేరిన విమానం తిరుచ్చిలో ల్యాండింగ్

పెరంబూర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): నగరం నుంచి శ్రీలంకకు బయల్దేరిన విమానంలో, అక్కడ వాతావరణం అనుకూలించకపోవడంతో, తిరుచ్చిలో ల్యాండింగ్ చేశారు. మీనంబాక్కం విమానాశ్రయం నుంచి శనివారం ఉదయం 10.20 గంటలకు శ్రీలంక జాఫ్నాకు 44 మంది ప్రయాణికులతో విమానం బయల్దేరింది. కానీ, జాఫ్నాలో విమానం ల్యాండింగ్‌కు వాతావరణం అనుకూలించలేదు. ఈ విషయాన్ని పైలెట్ తిరుచ్చి విమానాశ్రయ కంట్రోల్ రూమ్‌కు తెలియజేశారు. వారి అనుమతితో విమానాన్ని తిరుచ్చి విమానాశ్రయంలో ల్యాండింగ్ చేశారు. ప్రయాణికులకు విమానాశ్రయంలో బస కల్పించిన అధికారులు, జాఫ్నా వాతావరణం అనుకూలించడంతో తిరుచ్చి నుంచి జాఫ్నాకు విమానం బయల్దేరి వెళ్లింది.

విమానాశ్రయంలో రూ.1.06 కోట్ల మాదకద్రవ్యాల స్వాధీనం

పెరంబూర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక మీనంబాక్కంలోని విమానాశ్రయంలో రూ.1.06 కోట్ల విలువైన మాదకద్రవ్యాలు స్వాధీనం చేసుకున్న అధికారులు, ఒకరిని అరెస్ట్ చేశారు. థాయ్‌లాండ్ నుంచి నగరానికి వస్తున్న విమానంలో మాదకద్రవ్యాలు తరలిస్తున్న కస్టమ్స్ అధికారులకు సమాచారం అందించింది. దీంతో థాయ్‌లాండ్ నుంచి వచ్చిన ప్రయాణికులను అధికారులు తనిఖీలు చేపట్టారు. ఓ ప్రయాణికుడు లోదుస్తుల్లో దాచిన 3.03 కిలోల మాదకద్రవ్యాలు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. బహిరంగ మార్కెట్లో వీటి విలువ రూ.1.06 కోట్లు ఉంటుందని అధికారులు తెలియజేశారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు.

మొరాయించిన హెడ్ లైట్లు

● సెల్‌ఫోన్ వెలుగుల్లో 15 కి.మీ నడిచిన బస్సు

తిరుత్తణి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూర్ జిల్లా పళ్లిపట్టు సమీపంలో ప్రభుత్వ బస్సుల్లో లైట్లు మొరాయించడంతో, సెల్‌ఫోన్ టార్చి వెలుగుల్లో 15 కి.మీ వరకు డ్రైవర్ నడపడం ప్రయాణికులను ఆందోళనకు గురిచేసింది. శుక్రవారం రాత్రి షోలింగర్ రహదారిపై వెళ్తున్న ప్రభుత్వ బస్సు బ్యాటరీ దెబ్బతినడంతో హెడ్ లైట్లు, బస్సులోని లైట్లు హఠాత్తుగా ఆగిపోయాయి. ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చాలనే తపనతో బస్సు డ్రైవర్, తన వెనుకగా ప్రయాణికులను సెల్‌ఫోన్ టార్చి వెలిగించమని చెప్పి, ఆ వెలుగుల్లో 15 కి.మీ దూరం నడిపి వారి వారి గమ్యస్థానాలకు చేర్చారు.

ఆటో, ట్యాక్సీల ఛార్జీలు పెంచాలి

● పీఎంకే అధ్యక్షుడు అన్బుమణి

ప్యారీస్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఆటో, ట్యాక్సీల ఛార్జీలు పెంచాలని పీఎంకే అధ్యక్షుడు డాక్టర్ అన్బుమణి డిమాండ్ చేశారు. ఆయన శనివారం విడుదల చేసిన ప్రకటనలో, ఆటోలు, ట్యాక్సీలు తదితర అద్దె వాహనాల ఛార్జీలను 12యేళ్లుగా పెంచనందువల్ల, ఆ వృత్తులే జీవనాధారంగా ఉన్నవారు ఆర్థిక సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. చెన్నై సహా రాష్ట్రంలోని నగరాల్లో నడుపుతున్న ఆటోలు, ట్యాక్సీలు, అద్దెవాహనాల ఛార్జీలను చివరగా 2013 ఆగస్టు 25న పెంచారని ఆయన గుర్తుచేశారు. ప్రస్తుతం ధరలు రెండింతలు పెరిగాయని, ఇవన్నీ పరిశీలించి ఆటో, ట్యాక్సీ ఛార్జీల ధరలు పెంచాలని ఆయన రాష్ట్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

గ్రామసభలపై విద్యార్థులకు అవగాహన



నమూనా గ్రామసభలో విద్యార్థులు

పెరంబూర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): గ్రామ సభల ప్రాధాన్యతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కాంచీపురం జిల్లా వాలాజాబాద్ అగత్తియర్ మెట్రిక్ మహోన్నత పాఠశాలలో బాలల దినోత్సవం సందర్భంగా నమూనా గ్రామ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల కార్యదర్శి గాంధీ పర్యవేక్షించగా, దేవరియంపాక్కం పంచాయతి అధ్యక్షులు అజయ్‌కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ విషయమై ఉపాధ్యాయులు మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యలు పరిష్కారం కావాలంటే గ్రామ సభలు ఎంతో దోహదపడతాయన్నారు. అలాంటి గ్రామ సభల ప్రాధాన్యత తెలిపేలా ఈ కార్యక్రమం నిర్వహించనట్లు ఉపాధ్యాయులు తెలిపారు.

బిహార్ ఫలితాలు రాష్ట్రంలో పునరావృతం కావు

● టీటీవీ దినకరన్

పెరంబూర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): బిహార్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు రాష్ట్రంలో పునరావృత్తమయ్యే అవకాశాలు లేవని అమ్మ మక్కల్ మున్నేట్ర కళగం (ఏఎంఎంకే) ప్రధాన కార్యదర్శి టీటీవీ దినకరన్ అభిప్రాయం వ్యక్తం చేశారు. నగరంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... రాష్ట్రంలో ప్రస్తుతం డీఎంకే ప్రభుత్వం అధికారంలో ఉందన్నారు. రాష్ట్రానికి చెందిన వారే ‘సర్’ పనుల్లో పాల్గొంటున్నారన్నారు. అందరూ కలసి ‘సర్’ పర్యవేక్షణ చేస్తున్న సమయంలో, ఎన్నికల కమిషన్ ఏం చేస్తుందని? ప్రశ్నించారు. విజయ్ నేతృత్వంలోని టీవీకేతో పొత్తు పెట్టుకుంటున్నారనే పలువురు చెబుతున్నారని, కూటమిపై తాము ఇంకా నిర్ణయం తీసుకోలేదన్నారు. రాబోయే శాసనసభ ఎన్నికల్లో డీఎంకే-టీవీకే మధ్య పోటీ నెలకొంటుందని, ఈ విషయం ఒక రాజకీయ పార్టీ నేతగా కాకుండా, ఒక సామాన్య మనిషిగా చెబుతున్నానని దినకరన్ తెలిపారు.

ఉప ముఖ్యమంత్రికి హత్యా బెదిరింపు

పెరంబూర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఉప ముఖ్యమంత్రి ఉదయనిధికి హత్యా బెదిరింపు ఈ-మెయిల్ కలకలం రేపింది. డీజీపీ కార్యాలయానికి వచ్చిన ఈ-మెయిల్‌లో “రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి, ఆయన కుమారుడు ఇన్బనిధిలను హత్య చేసేందుకు నిర్ణయించాము. అందుకోసం హంతకులను కూడా నియమించాము. దీనిని నివారించాలంటే రూ.10 కోట్లు ఇవ్వాలి” అంటూ మెసేజ్‌లో ఉంది. పోలీసులు, హుటాహుటిన బాంబ్ స్క్వాడ్‌తో అక్కడకు చేరుకుని తనిఖీలు చేపట్టారు. అలాగే, ఈ-మెయిల్ మెసేజ్‌ను ఉగ్రవాద నిరోధక విభాగం పోలీసులకు పంపించారు. అలాగే, సినీ దర్శకుడు శంకర్, డాన్స్ మాస్టర్ కళ, నటుడు త్యాగరాజన్ తదితర ఇళ్లకు కూడా బాంబు బెదిరింపు ఈ-మెయిల్స్ వచ్చినట్లు, ఈ మెసేజ్ చిరునామా కోసం విచారిస్తున్నట్లు సైబర్ క్రైం పోలీసులు విచారిస్తున్నారు.

డిసెంబరు 19కి కొడనాడు కేసు వాయిదా



కొడనాడు ఎస్టేట్ భవనం

ప్యారీస్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): నీలగిరి జిల్లా కోథగిరి సమీపంలోని కొడనాడు ఎస్టేట్‌లో 2017లో జరిగిన హత్య, ఫర్నిచర్ దోపిడి తదితరాలకు సంబంధించిన కేసు విచారణ డిసెంబరు 19వ తేదీకి వాయిదా వేస్తూ జిల్లా ప్రిన్సిపల్ సెషన్స్ కోర్టు ఉత్తర్వులు జారీచేసింది. కొడనాడు ఎస్టేట్ భవంతిలో జరిగిన హత్య, దోపిడీలకు సంబంధించి 10 మందిని అరెస్టు చేశారు. రాష్ట్రప్రభుత్వం ఈ కేసు విచారణను సీబీసీఐడీకి బదిలీ చేసింది. ప్రస్తుతం ఈ కేసు విచారణ నీలగిరి జిల్లా ప్రిన్సిపల్ సెషన్స్‌కోర్టులో జరుగుతోంది. న్యాయమూర్తి మురళీధరన్ సమక్షంలో శుక్రవారం జరిగిన విచారణకు ముద్దాయిలు కేరళ రాష్ట్రానికి చెందిన వాలయార్ మనోజ్, జితిన్‌జాయ్‌లను సీబీసీఐడీ ఏడీఎస్పీ మురుగవేల్ హాజరుపరిచారు. ప్రభుత్వం తరుపున హాజరైన న్యాయవాది ఈ కేసు విచారణకు మరింత గడువు కావాలని కోరారు. దీనికి అంగీకరించిన న్యాయమూర్తి ఈ కేసు తదుపరి విచారణను డిసెంబరు 19వ తేదీకి వాయిదా వేస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

కూడన్‌కుళమ్ వద్ద బస్సు బోల్తా

● 27 మందికి గాయాలు



చెన్నై, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): తిరునల్వేలి జిల్లా కూడన్‌కుళమ్ వద్ద రాష్ట్ర రవాణా సంస్థ బస్సు అదుపు తప్పి బోల్తాపడటంతో 27 మంది ప్రయాణికులు గాయపడ్డారు. తూత్తుకుడి జిల్లా తిరుచెందూరు నుండి నాగర్‌కోవిల్‌కు శనివారం వేకువజాము బయల్దేరిన ఆ బస్సులో 60 మంది ప్రయాణిస్తున్నారు. ఆ బస్సు కూడన్‌కుళమ్ వద్ద వెళ్తుండగా అదుపు తప్పి రహదారి పక్కనే మట్టి దిబ్బలో కుడివైపు టైర్ కూరుకుపోయి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో 27 మంది గాయపడ్డారు. ఈ సమాచారం అందుకుని పోలీసులు అంబులెన్స్‌లను రప్పించి వారిని చికిత్స నిమిత్తం నాగర్‌కోవిల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఘనంగా బాలల దినోత్సవం



విద్యార్థులకు స్వీట్లు తినిపిస్తున్న నిర్వాహకులు

తిరుత్తణి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూర్ జిల్లా ఎస్వీజీ పురం గ్రామంలోని ఆరుక్షయ్‌వెత్రి విద్యాలయం మెట్రిక్యులేషన్ హయ్యర్ సెకండరీ పాఠశాలలో బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్ఆర్ మూర్తి అధ్యక్షత వహించగా, పాఠశాల కరస్పాండెంట్ ఏఎం నరసింహ భారతి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు విద్యా ఉపకరణాలు, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల కార్యదర్శి ఎన్.శివజ్ఞానం, పాఠశాల కోశాధికారి ఈఎస్ శివరసన్, పాఠశాల డైరెక్టర్ శివశక్తి ఎం.కుప్పన్, పాఠశాల కో-ఆర్డినేటర్లు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటి లోపల గడియ వేసుకున్న బాలుడు

● రక్షించిన అగ్నిమాపక సిబ్బంది



బాలుడిని రక్షించేందుకు యత్నిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

పెరంబూర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఇంట్లో చిక్కుకుపోయిన బాలుడిని అగ్నిమాపక సిబ్బంది సురక్షితంగా రక్షించారు. తూత్తుకుడి అన్నానగర్‌కు చెందిన గణేశన్‌కు ఐదేళ్ల కుమారుడున్నాడు. శనివారం ఉదయం గణేశన్ భార్య ఇంటి బయట పనులు చేస్తుండగా, బాలుడు ఇంట్లో ఆడుకుంటున్నాడు. ఊహించని విధంగా ఇంటి లోపల వైపు బాలుడు తలుపు గడియ వేసుకున్నాడు. ఎంతకూ అది రాకపోవడంతో బాలుడు ఏడవడం ప్రారంభించాడు. కుమారుడి ఏడుపు విన్న తల్లి, బంధువులు అక్కడకు చేరుకుని తలుపు తీసేందుకు చేపట్టిన ప్రయత్నాలు ఫలించలేదు. వారిచ్చిన సమాచారంతో అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని, ఇంటి వెనుక వైపున్న తలుపును బద్దలుకొట్టి లోనికి వెళ్లి బాలుడిని రక్షించారు.